

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం

28 జూన్ 2025 పేజీలు : 08


## కాకాణికి బెయిల్



నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ : వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తరలించారనే ఆరోపణలపై నమోదైన కేసులో రెండవ నిందితుడిగా ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు రెండవ అద నపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శారదరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడైన గోవర్ధన్ రెడ్డిని రూ.10 వేల విలువ గల ఇద్దరు జామీన్‌దారుల పూచికత్తులతో బెయిల్‌పై విడుదల చేయాలని న్యాయమూర్తి తమ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రస్తుతం కాకాణి గోవర్ధన్ రెడ్డి రిమాండ్ ఖైదీగా జిల్లా జైల్లో ఉన్నారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ




నెల్లూరు, మేజర్‌న్యూస్ : వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని వివరించారు. శుక్రవారం కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో కోవూరు హరిజనవాడకు చెందిన హరిప్రసాద్‌కు, రూరల్ నియోజకవర్గం కోడూరుపాడుకు చెందిన హరికృష్ణ అనే దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రై సైకిళ్లు అందుకున్న దివ్యాంగులతో -మిగతా 3లో

## నాన్న కల నెరవేరబోతోంది



## గాడి తప్పిన సం'క్షేమం'



- శిథిలావస్థలో వసతి గృహ భవనాలు
- అంతంత మాత్రంగా పాటిస్తున్న మెనూ
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

పేద విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన వసతి గృహాలు రోజురోజుకీ శిథిలమైపోయి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు ప్రతి ఏడాది బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాదైనా.. పాలకులు, అధికారులు పట్టించుకుని తగు చర్యలు తీసుకుంటారులే అనుకున్న తరుణంలో ఆ ఊసే కనిపించకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో పాటుగా మేము కూడా అంతంత మాత్రమే ఉంటుండడంతో విద్యార్థులు వసతి గృహాల్లో చేరేందుకు వెనకంజ వేయక తప్పడం లేదు. దీంతో సంక్షేమం కాస్త గాడి తప్పిందని చెప్పవచ్చు. *వివరాల్లోకి వెళితే..*

మర్రిపాడు, మేజర్‌న్యూస్ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు పేద విద్యార్థుల కోసం నడుపుతున్నప్పటికీ అవి కాస్త శిథిలావస్థకు చేరి దర్శనమిస్తుండడంతో విద్యార్థులు ఆ వసతి గృహాల్లో చేరేందుకు వెనకంజ వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ వసతి గృహాల పర్యవేక్షణ మరవడంతో ఈ దుస్థితి నెలకొందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ప్రస్తుత ఏడాది ఆ ఊసే కనిపించకపోవడంతో విద్యార్థులు వసతి గృహాల వైపు -మిగతా 2లో

### మంత్రి చొరవతో పార్కులు, పాఠశాలలకు
## మహర్దశ



నెల్లూరు నియోజక వర్గంలో పార్కుల పండగ కొనసాగుతోంది. 11వ డివిజన్‌లో 50 లక్షలతో ఆధునీకరించిన చేరుకుతోట పార్కును మంత్రి డాక్టర్ నారాయణ శుక్రవారం ప్రారంభించారు. 2లో

### ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో రాష్ట్రానికి
## పూర్వవైభవం

### విజనరీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యం

- త్వరలోనే మనుబోలులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు
- జాబ్ మేళాలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, శృతి
- ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సోమిరెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన జాబ్ మేళాకు 1403 మంది హాజరు

నెల్లూరు, మేజర్‌న్యూస్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, యూనివర్సిటీ సహకారంతో సోమిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 34 కంపెనీలు -మిగతా 2లో



# నాన్న కల నెరవేరబోతోంది

## మంత్రి కుమార్తె పొంగూరు షరణి

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** పేదపిల్లలకు డిజిటల్ విద్య అందించాలన్న తన తండ్రి కల నెరవేరబోతోందని మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఊహలకు అందని విధంగా సిద్ధమైన వీఆర్ హైస్కూల్‌ను జులై 6వ తేదీన విధ్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో ఎన్సీసీ ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైన వీఆర్సీని మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి శుక్రవారం పరిశీలించారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్‌గా నిత్యం బిజీ బిజీగా ఉండే షరణి.. తండ్రి నారాయణ అప్పజెప్పిన బాధ్యతలను తూచ తప్పక పాటిస్తున్నారు. తన విద్యాసంస్థల పనులు పక్కన పెట్టి తరచూ వీఆర్సీ పనులు పర్యవేక్షిస్తూ, సూచనలిస్తూ.. హైస్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. 100 శాతం పనులు పూర్తి కావటంతో స్కూల్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో చర్చించారు. డిజిటల్ విద్యాబోధనపై పలు సూచనలు ఇచ్చారు. అనంతరం షరణి మాట్లాడుతూ.. నాన్న సంకల్పానికి అనుగుణంగా వీఆర్సీ రూపుదిద్దుకొంద న్నారు. వీఆర్సీలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించబోతున్నా మన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తరగతి గదులు, క్రీడా మైదానం సిద్ధం చేశామని తెలిపారు. పేదపిల్లల కోసం మొట్ట మొదటిసారి డిజిటల్ విద్యను



ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి తరగతులు మొదలవుతాయని, జులై 6 తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వీఆర్సీని ప్రారంభిస్తారని వెల్లడించారు. నాన్న కల నెరవేరబోతోందని, పేద పిల్లల కోసం చేపట్టిన మహా యజ్ఞంలో భాగస్వామి కావటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనవంతుగా సీఎం చంద్రబాబు నాయుడు మానస పుత్రిక పీ4 కార్యక్రమం ద్వారా 20 మంది విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకుని ఆ పిల్లల చదువులకయ్యే ఖర్చు మొత్తం భరిస్తానన్నారు. నారాయణ విద్యాసంస్థల నుంచి నాలుగు జతల యూనిఫామ్‌తో పాటు, హైస్కూల్ పిల్లలు కోరితే సైకిళ్ళు కూడా ఉచితంగా అందజేస్తా మన్నారు. పేద పిల్లలకు తమ అండ ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

## మంత్రి నారాయణ చొరవతో

# పార్కులు, పాఠశాలలకు మహర్దశ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నియోజకవర్గంలో పార్కుల పండగ కొనసాగుతోంది. 11వ డివిజన్‌లో 50 లక్షలతో ఆధునీకరించిన చేరుకుతోట పార్కును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నారాయణ శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. అన్నిహంగులతో పార్కును సిద్ధం చేసిన మంత్రికి చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలకు చాక్లెట్లు పంచి, వారితో ఆటలాడించి మంత్రి కాసేపు సరదాగా గడిపారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. పిల్లల్లో మానసిక ఉల్లాసాన్ని, శరీర ధారుడ్యాన్ని పెంపొందించేందుకు పార్కులు దోహదపడతాయన్నారు. సిటీలో 50 పార్కులు ఆధునీకరిస్తున్నామని, 30 పార్కులు పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. 2014 –19 మధ్యలో రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్ ఇచ్చేందుకు ఎన్టీఆర్ సుజల సురక్షను టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సిటీలో 30 వేల కుటుంబాలకు ఆరు లక్షల లీటర్ల మినరల్ వాటర్ అందివ్వటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అమృత్ పథకం కింద ప్రతీ ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇస్తామని, నెల్లూరుని దోమల రహిత నగరంగా చేస్తానని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్సీని ఆధునీకరించామన్నారు. సిటీలోని 54 ప్రభుత్వ స్కూల్స్‌ని వీఆర్సీ తరహాలో సిద్ధం చేయటమే తన లక్ష్యమన్నారు. పేద పిల్లలకి డిజిటల్ విద్యను అందించాలన్నదే యువనేత నారా లోకేష్ సంకల్పమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి పాలనాదక్షతతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోందన్నారు. ప్రజలు కాస్త ఓపిక పడితే హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్ గోతాం అరుణ, డివిజన్ ప్రెసిడెంట్ నాగేంద్ర, టీడీపీ నేతలు తిరుమల నాయుడు, బాలాజీ, కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# గాడి తప్పిన సం'క్షేమం' !

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లడం మానేశారని చెప్పవచ్చు. ఉదాహరణకు జిల్లాలోని మర్రిపాడు మండలంలోని వసతి గృహాలను పరిగణలోకి తీసుకోవచ్చు. జిల్లాలోని మర్రిపాడు మండలంలో బ్రాహ్మణపల్లి, కంపసముద్రం, మర్రిపాడు గ్రామాల్లో బాలుర బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో కంప సముద్రం, మర్రిపాడు బాలురు వసతి గృహం మరీ అధ్వాన్నంగా తయారై శిథిలావస్థకు చేరాయి. ఈ పరిస్థితి గత ఐదేళ్ల నుంచి ఉన్నప్పటికీ అటు పాలకులు కానీ, ఇటు ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ భయాందోళన చెందుతూ కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రెండు వసతి గృహాల్లో స్లాబులు హెచ్చులూడి పడుతుండడమే



కాకుండా గదులన్నీ వర్షాకాలం వస్తే ఉరుస్తున్నాయి. అయితే విద్యార్థులు పడరాని పాట్లు ప్రతి ఏడాది పడక తప్పడం లేదు. దీంతో ఏడాదికి ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కంప సముద్రం, మర్రిపాడు బాలుర వసతి గృహాల్లో గతంలో వందకు పైగా విద్యార్థుల సంఖ్య కనపడేది. నేడు 20 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ఆ వసతి గృహాల్లో ఉంటూ పదిమంది మాత్రమే నిలకడగా హాజరవుతుండడం విశేషం. ప్రస్తుత ఏడాది విద్యార్థులు వసతి గృహాన్ని చూసి వెనుతిరుగుతున్నారు. పేద విద్యార్థులు ఎంతో ఆశగా వసతి గృహాల్లో చేరడానికి సముఖత చూపిస్తున్నప్పటికీ ఉండటానికి వసతి గృహాలు శిథిలావస్థలో కనిపిస్తుండడంతో వెను తిరక్క తప్పడం లేదు. దీంతో సంక్షేమ వసతి గృహాలు గాడి తప్పి అటకెక్కాయని చెప్పవచ్చు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరుకున్న ఆ వసతి గృహాలను మరమ్మత్తులు కానీ, లేక నూతన భవనాలను నిర్మించడం కానీ, లేక ప్రస్తుత ఏడాది అద్దె భవనాల్లోనైనా నడపాల్సిందిగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


# ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో రాష్ట్రానికి పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళాకు 1403 మంది హాజరుకావడం ఆనందదాయకం అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రముఖ కంపెనీలు రావడం శుభపరిణామం అన్నారు. ఈ రోజు 438 మందికి ఉద్యోగాలు ఖరారయ్యాయని, మరో 106 మంది షార్ట్ లిస్ట్‌లో ఉన్నారన్నారు. ప్రస్తుతం అవకాశం రాని వారికి కూడా వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సోమిరెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగంలో చేరితే యువత జీవితం మారిపోయినట్టే అని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, జాబ్‌మేళాలతో రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఏడాది పాలనలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలతో ఎంఓయూలు జరిగాయన్నారు. సిలికాన్ వ్యాలీ మోడల్‌లో రూ.6 వేల కోట్లతో క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నారని, విజనరీ లీడరైన చంద్రబాబు నాయుడికే ఇలాంటి ఆలోచనలు వస్తాయన్నారు. హైటెక్ సిటీ నిర్మాణంతో ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా చేసిన ఉమ్మడి ఏపీ సీఎంగా ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రపంచం లోని ఏ మూలకు వెళ్లినా తెలుగు యువతే కనిపిస్తోందని, రాష్ట్రవ్యాప్తం గా మళ్లీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ప్రారంభమయ్యే పరిస్థితి రావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ముత్తుకూరు మండ లం కృష్ణపట్నంలోని రిలయన్స్ భూముల్లో సోలార్ ప్యానెల్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామంటున్నారని, త్వరగా ఏర్పాటైతే చాలా మందికి ఉద్యోగాలు లభిస్తా యన్నారు. మనుబోలు మండలంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం 60 ఎకరాలకు పైగా భూముల ను గుర్తించామని, త్వరలోనే శంకుస్థాపన జరగబో తోందని తెలిపారు. జాబ్‌మేళా ఏర్పాట్లను పర్యవేక్షించి.. ప్రతి ఒక్కరినీ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతి రెడ్డిలు అప్యాయంగా పలుకరించారు. జాబ్ మేళా సక్సెస్ అయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన యువత్‌కు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డిలు నియామక పత్రా లను అందజేశారు. జాబ్‌మేళా నిర్వహించిన సోమిరెడ్డి ఫౌండేషన్‌కు యువత కృతజ్ఞతలు తెలియజేశారు.









# 41వ డివిజన్ వైసీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆనం విజయకుమార్ రెడ్డి సారధ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతారెడ్డి పాళెం నందు వైసీపీ కార్యాలయం నందు 41వ డివిజన్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మన నెల్లూరు రూరల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, రూరల్ అధికార పార్టీ నాయకుల ఆగడాలకు బయపడి బయటికి రాలేని పరిస్థితుల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నన్ను నెల్లూరు రూరల్ అధ్యక్షులుగా నియమించిన తరువాత రూరల్ నియోజకవర్గ నా మొదటి పార్టీ సమావేశంకి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద అభిమానంతో నిజమైన నాయకులు, కార్యకర్తలు నేను కూడా ఊహించనంతగా వేలాదిగా కదిలి వచ్చి మొదటి సమావేశాన్ని విజయవంతం చేసి నాలో ఎంతో గుండె నిబ్బరాన్ని నింపి నాకు ఎంతో మనోబలాన్ని ఇచ్చారని తెలిపారు. అలాగే ప్రతి డివిజన్ నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రతి డివిజన్లో స్ట్రాంగ్ కమిటీ ఏర్పాటు చేసుకుని నిజమైన పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఈ ఆత్మీయ సమావేశాలను విజయవంతం చేస్తున్నారని అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలియజేస్తూ, మీ అందరి సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ పార్టీకి పూర్వవైభవం, తీసుకునివచ్చి గ్రౌండ్ లెవల్లో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తని నూతన నాయకులుగా తయారు చేసుకుని కమిటీల్లో నియమించికుని పార్టీ కోసం ఎవరైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో వారికే ప్రాధాన్యత ఇస్తామని అలంకారప్రాయంగా పదవులు పొంది షో చేసే వాళు ్ళ పార్టీకి అవసరం లేదని,ఇప్పటికే చాలామంది నెల్లూరు రూరల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసే దిశగా బాగా కష్టపడుతున్నారు అని ఇప్పటికే పార్టీ నెల్లూరు రూరల్లో చాలా జోరుగా బలోపేతం అయ్యింది అని,వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అంటే అభిమానం ఉండే వాళ్ళు, నియోజకవర్గ పార్టీ నాయకత్వం మీద నమ్మకం ఉండే వాళ్ళు ప్రతి నాయకుడు, కార్యకర్త, అందరం కలిసి ఒక కుటుంబంగా కలిసికట్టుగా పనిచేసి ఇంకా పార్టీని బలోపేతం చేద్దాం అని తెలియజేసారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ వైసీపీలో ప్రతి ఒక్కరికి నేను 24గం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరితో నేను ఆత్మీయంగా స్నేహంగా మీ అందరితో కలిసి ఉంటాను అని పార్టీ పరంగా మీ ప్రతి సమస్యని నా సమస్యగా భావించి మీకు అండ దండుగా ఉంటానని తెలియజేశారు. అనంతరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 41వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసులు ని నియమించడం జరిగింది. అలాగే ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ విభాగ అధ్యక్షుడు దాసరి రాజేష్, నెల్లూరు రూరల్ నాయకులు శివారెడ్డి, 41వ డివిజన్ నాయకులు వరప్రసాద్, ప్రభాకర్, బొమ్మన బోయిన మస్తానయ్య, కె.చిన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అచ్చమాంబ కళ్యాణం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసి ఉన్న అచ్చమాంబ దేవత కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు 22వ తేదీ ఆదివారం నిలుపు మొదలుకొని భీమవరం, పొంగూరు, ఆమని సిరివెళ్ల, కేతిగుంట గ్రామాల్లో గ్రామ ఉత్సవాలు జరుపుకొని అచ్చమాంబ ఆలయంలో అమ్మవారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గాదిశెట్టి వెంకటకృష్ణ, లక్ష్మికుమారి దంపతుల (లక్ష్మీ ప్రొవిజన్స్, మర్రిపాడు) చేతుల మీదుగా కళ్యాణం నిర్వహించడం జరిగినది. ఈ యొక్క కళ్యాణం తిలకించుటకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది. తదుపరి శనివారం రోజు అమ్మవారికి ఊరేగింపు భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఆదివారం రోజున పొంగళ్ళు, ఎద్దుల చేత పందెపు బండను లాగించబడునని, గెలిచిన వారికి మొదటి బహుమతి కింద మాజీ సర్పంచ్ 30016, రెండవ బహుమతి అన్నపరెడ్డి రామిరెడ్డి భార్య రమణమ్మ గ్రామ సర్పంచి పొంగూరు వారిచే,రూ 25016 లు,. మూడో బహుమతి తంగేడుపల్లి శ్రీనివాసులు గంగ పాలెం గంగపాలెం వెంకటేశ్వర లైటింగ్ డెకరేషన్ వారిచే రూ.20016లు ఇవ్వడం చుంచులూరు వారు ఇవ్వడం జరుగుతుందని బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ పెద్దలు తెలియజేశారు. ఈ యొక్క అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రారంభం నుంచి చివరి వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలియజేశారు. కావున భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు తిలకించి అమ్మవారి కృపాకటాక్షములు పొందవలసిందిగా ఉత్సవ కమిటీ తెలిపారు.

# పార్టీ పదవులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పార్టీపదవులు పొందినవారు బాధ్యతాయుతంగా సేవానిరతితో విధులు నిర్వహించాలని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పరిశీలకులు జాఫర్‌షరీఫ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డిలు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిల ఆదేశాలతో పార్టీ సంస్థాగత ఎన్నికల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 4, 7, 14, 16,17, 18, 19 వార్డుల టిడిపి కమిటీలను అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. 4వవార్డు టిడిపి అధ్యక్షుడుగా కాపా వెంకటసుబ్బయ్య, 14వవార్డు అధ్యక్షుడుగా తోడేటి పెంచలయ్య, 17వ వార్డు అధ్యక్షుడుగా షేక్ సర్దార్, 18వవార్డు అధ్యక్షుడుగా షేక్ అస్లాం, 19వ వార్డు అధ్యక్షుడుగా షేక్ ఇనయతుల్లా, 7వవార్డు అధ్యక్షుడుగా సయ్యద్ మల్లిక, 16వవార్డు అధ్యక్షుడుగా షేక్ బషీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇతర కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. వారందరికీ పరిశీలకులు ధృవీకరణపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో పనిచేసేవారికే కమిటీల్లో పదవులు లభిస్తాయని, వారు పార్టీ పటిష్టానికి, బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి, ఆయా వార్డుల అభివృద్ధికి శ్రద్ధతో కృషిచేయాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, వారికి తరచూ వివరిస్తుండాలని జాఫర్‌షరీఫ్, చంద్రారెడ్డిలు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మెన్ ఇందూరు వెంకటరమనారెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేవ్వర్లు నాయుడు, పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మెన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, గంధళ్ళ వేణు, మొలబంటి రాజశేఖర్, తెలుగుదేశం నాయకులు గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పి.శ్రీరాములు, గోరీ షబ్బీర్, మథీన్, తాటిపర్తి పెంచలయ్య, బాలకృష్ణ, అబ్దుల్ మసూద్, అంబటి నాగేశ్వరరావు, మున్నా, దండు ప్రవీణ్, సయ్యద్ ఆసిఫ్, ఆయా వార్డుల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమ చేయండి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ముత్తుకూరు గ్రామపంచాయతీ కార్మికులు అధికారులను కోరారు. శుక్రవారం సిఐటియు నాయకత్వంలో కార్మికులు అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమైన డిమాండ్లను ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఎంపీడీవో నాగమణికి వినతి పత్రం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడారు. పనిచేసే సమయంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. మస్టర్ విధానంలో కార్మికులకు అటెండెన్స్ వేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. పెండింగ్ వేతనాలు త్వరగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంకయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ పై అవగాహన పెంచుకోవాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** లోక అదాలత్‌పై అవగాహన పెంచుకొని కక్షలు కార్పన్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని లోకఅదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపారు. కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్ లో ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. అలాగే కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కావలిలో జరుగు లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో నిరుపేదలకు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కొరకు ఈ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని తెలిపారు.

## అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి : ఎంపీపీ గంధల్ల శంకరయ్య




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంధల్ల. శంకరయ్య అధ్యక్షతన ఎంపీడీవో నాగేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయాశాఖల అధికారులుతమ తమ శాఖల ద్వారామండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరంఎంపీడీవో నాగేంద్రబాబు మాట్లాడుతూ.. మండలంలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కైలాసం లావణ్య రెడ్డి, ఎంపీటీసీ అద్దంకి మమత, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇన్‌చార్జ్ తహశీల్దార్ సిహెచ్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంతమ్మ కొద్దిసేపు మాట్లాడారు. ట్రై సైకిల్ ఉపయో గించే విధానంపై వారికి వివరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో ట్రై సైకిళ్ల అందజేత కార్యక్రమం చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి బలవంతపు

# వసూళ్లకు పాల్పడుతున్న దొంగలు అరెస్టు




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** చెడు వ్యసనాలకు బానిసలై జల్సాలకు అలవాటు పడి ఒంటరిగా ఉన్న ప్రజలను కత్తులతో బెదిరించి, వారి వద్ద నుండి డబ్బులు బలవంతంగా తీసుకునే దొంగల ఆట కట్టించిన నవాబుపేట పోలీసులు. వివరాల్లోకి వెళితే.. గత బుధవారం రాత్రి బత్తుల బాలాజీ అనే ఎఫ్సీఐ కాలనీ చెందిన బ్యాంకు ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో కలిసి మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తుండగా ముగ్గురు ముద్దాయిలు మోటార్ సైకిల్ పై వెంబడించి రైల్వే స్టేషన్ ఎదురుగా అడ్డగించి కత్తులు చూపి భయపెట్టి బలవంతంగా డబ్బులు లాక్కెళ్లారని, అదే విధంగా అదేరోజు తడికల బజార్ వద్ద గల అరుంధతిలో ఒంటరిగా తన ఇంటి బయట నిద్రిస్తున్న పంచాల లక్ష్మి అనే మహిళ అదే ఏరియాకు చెందిన ఇద్దరు కుర్రాళ్ళు కత్తులతో బెదిరించి మద్యం తాగుటకు డబ్బులు లాక్కున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు నవాబుపేట సీఐ జి.వేణుగోపాల్ రెడ్డి కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ అదేశాలతో మేరకు అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో టౌన్ డీఎస్పీ సూచనలతో నవాబుపేట సీఐ ఆధ్వర్యంలో వారి సిబ్బందితో దర్యాప్తు జరిపి శుక్రవారం ముద్దాయిలు యానం మునితేజ (26) వుడ్ హౌస్ సంఘం, చింతకాయల మహేష్ కుమార్ (19) వుడ్ హౌస్ సంఘం, బొర్ర దేవకుమార్ (22) బాలాజీ నగర్, సగాలి జగదీష్ (17) అరుంధతి వాడ, తోటా లోకేష్ కళ్యాణ్ (17) అరుంధతి వాడ (మైనర్స్)లను పట్టుకొని మీడియా ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నిందితులు వ్యసనాలకు బానిసలై, జలసాలకు అలవాటు పడి ఒంటరిగా ఉన్న వారిని కత్తులతో బెదిరించి నేరాలకు పాల్పడుతున్నట్టు నేరాలు ఒప్పుకోనుగా వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, ఇదే క్రమంలో ముద్దాయిల వద్ద నుండి నగదు రెండు కత్తులు స్వాధీనం చూసుకొని డిమాండ్ తరలిస్తున్నట్లు వారిలో ఇద్దరు బాల నేరస్తులు కావడంతో వారిని తిరుపతి బాల నేరస్తుల హోంకు పంపిస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా తమ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కేసు చేదించడంలో ప్రతిభ కనబరిచిన నవాబుపేట సీఐ, ఎస్ఐ ఎస్ఏ రహీమాన్, సిబ్బంది బివి నరసయ్య, ఎస్.ప్రసాద్, టి.మస్తాన్ రావు, డి.సుధాకర్, ఎం.వేణు, జి.మస్తానయ్య, ఎస్కే గౌస్ బాషాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# సబ్ స్టేషన్ పనులు పరిశీలన : కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పాత వెల్లంటి గ్రామంలో శనివారం ఉదయం 10గంటలకు ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా శనివారం ఉదయం 10గంటలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పనుల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, క్లస్టర్ ఇన్‌చార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే మండల కార్యాలయం ఇన్‌చార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, మండల కో ఆప్షన్ మెంబర్ మీరా మోహిద్దీన్, టిడిపి నాయకులు కుండా మురళి రెడ్డి, కుండా సురేష్ రెడ్డి, బెలుమ్ శ్రీనివాసులు రెడ్డి, ఆదిత్య రెడ్డి, వెంకట రమణారెడ్డి, మారం శ్రీనివాసులు రెడ్డి, ఆమవరపు వెంకటేశ్వర్లు, రామారావు, సీనయ్య, సురేంద్ర, రాపూరు రత్నం, కాలయ్య, ఆదిశేషయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, దేవరాల సీనయ్య పలువురు పాల్గొన్నారు.

# ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐవీఆర్ఎస్ కాల్స్ కు ఎంపిక కాబడిన అన్ని గ్రామపంచాయతీలలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి ఏడు గంటల 30 నిమిషాల వరకు ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శి స్వయంగా సందర్శించి గ్రామంలో ఉన్న డోర్ టు డోర్ చెత్త సేకరణ పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే ప్రతి ఇంటికి ఐవిఆర్ఎస్ కాల్స్ పైన అవగాహనపరిచి ప్రజలందరిని సంపూర్ణ పారిశుధ్యంలో భాగస్వాములు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే గ్రామ పంచాయతీలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామ పంచాయతీకి ఎంపీడీవో, గాని డిప్యూటీ ఎంపీడీవో, గాని హాజరవుతామని తెలిపారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న త్రాగునీటి ట్యాంకుల్లో ప్రతిరోజు ఉదయం 10:30 లోపల క్లోరినేషన్ చేయించి వివరాలను పీఆర్ వన్ యాప్‌లో అప్డేట్ చేయవలసిందిగా ఆదేశించారు.అలాగే ప్రతి 15 రోజులకు ఒకసారి త్రాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి పరిశుభ్రమైన నీరు ప్రజలకు అందించాలని కోరారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు, స్వర్ణ పంచాయితీ పోర్టల్‌ల్లో అప్డేట్ చేయవలసిందిగా కార్యదర్శులకు ఆదేశించారు. ఈనెల 30వ తేదీ లోగా వంద శాతం హౌస్ టాక్స్ అప్డేట్, కలెక్షన్, చేయని పంచాయతీ కార్యదర్శిలకు డిపిఓ, తగిన చర్యలు తీసుకుంటారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సైదాపురంలో ఆర్డీఓ అనూష తనిఖీలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని పలు ప్రాంతాలలో లీజులు ముగిసిన మైన్‌లలో అక్రమ మైనింగ్ జరిగిందని, గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు లేవని వచ్చిన పిర్యాదు మేరకు సర్వే చేపట్టిన నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషిని అనూష నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో లీజులు ముగిసిన, గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు లేవని జయలక్ష్మి, సిద్ధి వినాయక, శోభారాణి, శ్రీనివాస పద్మావతి, కనకదుర్గ, మైన్‌లలో అక్రమ మైనింగ్ చేస్తున్నారంటూ వైసిపి మాజీ జెడ్పిటిసి పొట్టేళ్ల శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ మైన్ లలో సర్వే చేసేందుకు నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష, జిల్లా మైనింగ్ అధికారులు, సైదాపురం తహసిల్దార్ సుభద్ర, పొల్యూషన్ అధికారులు శుక్రవారం ఉదయం నుంచి సర్వే తనిఖీలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకే ప్రెస్ మీట్ పెట్టి వివరాలు తెలుపుతాను అని చెప్పిన ఆర్డీవో నాగ సంతోషిని అనూష గుట్టు చప్పుడు లేకుండా వెళ్ళిపోవడం గమనార్హం.

## పర్వతరెడ్డికి ఇస్లామిక్ న్యూ ఇయర్ శుభాకాంక్షలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రాంజీ నగర్ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ రవూఫ్ మైనారిటీ నాయకులతో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికలిసి శుక్రవారం ఇస్లామిక్ న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలను సొంతం చేసుకుని రాజకీయాల్లో మరింత మిన్నగా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ముస్లిం సంచార జాతుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బాబా బాయ్, మైనార్టీ నేతలు జుబేర్, జహీర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరికి చేరుకున్న సైకిలాయాత్ర




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రెడ్‌క్రాస్‌లో విధులు నిర్వహిస్తున్న సాయిరాం రక్తదానంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సైకిల్ యాత్ర శుక్రవారం ఉదయగిరి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిరాం రాష్ట్ర వ్యాప్తంగా 50 రోజులపాటు నిర్విరామంగా 1,300 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. వయసు పైబడినా సాయిరాం ధృడసంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టి రక్తదానంపై అవగాహన కల్పించారన్నారు. పవన్ కల్యాన్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ తరుపున నియోజకవర్గంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సాయిరాంను ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, నాయకులు నిమ్మలపల్లె రామచైతన్య, కమతం శ్రీను, రసూల్ పఠాన్, పవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆషాడమాసం సారె కార్యక్రమ కరపత్రాల పంపిణీ




**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో వెలసియున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారికి జూలై 17వ తేదీన జరిగే ఆషాడ మాస కార్యక్రమం కి భక్తిశ్రద్ధలతో ఉదయగిరి నియోజకవర్గంలో ఉన్నటువంటి 8 మండలాలకు సంబందించిన గ్రామాల నుండి భక్తులు ఈ సారె కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ఆషాడ మాసం సారె సమర్పించాలని అమ్మవారి అనుగ్రహం పొందాలని అన్ని గ్రామాలలో పాడి పంటలతో జీవకోటి మానవాళి అందరూ అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా కార్యకర్తలు నిర్వహణ చేస్తున్నారు. కావున ప్రతి గ్రామం నుండి కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సారెగా సమర్పించాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి సంబందించిన కరపత్రాన్ని వెంగమాంబ పేరంటాలు దేవస్థానం ఆవరణలో కార్యనిర్వాహణ అధికారి ఉషశ్రీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ నెల్లూరు జిల్లా మహిళా సహ కన్వీనర్ మాలెపాటి ప్రవంతి, కలిగిరి మండల మహిళా కన్వీనర్ రమాదేవి, మండల సహ కన్వీనర్ రాణెమ్మ, జలదంకి మండల మహిళా కన్వీనర్ పద్మావతి, వరికుంటపాడు మండల మహిళా సహ కన్వీనర్ అంకమ్మ, మాలెపాటి మల్లిఖార్జున, మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరి గోపాల్ రెడ్డి, జిల్లా ధర్మ ప్రచారక్, కర్రా భాస్కర్, ఉదయగిరి ఖండ ధర్మ ప్రచారక్ పోరుమామిళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** పేదల సంక్షేమం కొరకై పాటుపడుతూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు అన్నారు. ఆయన మండల కేంద్రమైన మర్రిపాడులో శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిశీలకులు మధుసూదన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ మండల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కష్టాలు తెలుసుకొని ఆనాడు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం అతి కొద్ది కాలంలోనే అధికారాన్ని చేపట్టిన ఘనత గుర్తు చేశారు. పేదలకు బియ్యం అందించే ప్రక్రియ నుంచి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. ఆ తర్వాత పార్టీకి అధ్యక్షతగా వ్యవహరిస్తూ ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న చంద్రబాబు ప్రజలు గుండెల్లో నిలిచారన్నారు. ఎన్నికల వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతున్నారు. దీంతో పాటుగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మర్రిపాడు మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మర్రిపాడు మండల ఎస్సీ సెల్ నాయకులు పి.పోలయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ డి గంగాధర్ ప్రధాన కార్యదర్శి బి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు హాజరత్‌బాబు, సీనియర్ నాయకులు వెంకట్రామయ్య, తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ, మాజీ ఎంపీటీసీ బంక సుబ్బారెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ చెన్నారెడ్డి, బుధవాడ సొసైటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ప్రారంభం

## జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఉపయోగార్థం సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటు చేసి శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఉపయోగార్థం 30 కెడబ్ల్యు సామర్థ్యం వున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందుకుగాను, జిల్లా ప్రజా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.6.75లక్షలు వెచ్చించామన్నారు. పర్యావరణ పరిరక్షణ, రినేబుల్ ఎనర్జీలో భాగంగా ఈ పనిని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంను ఒక ఆదర్శవంతమైన కార్యాలయాలుగా నిలపాలని ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటు చేయటం వల్ల ప్రతి నెల విద్యుత్ చార్జీల క్రింద చెల్లించు మొత్తంలో 80శాతం సుమారు రూ.40వేలు తగ్గి సంవత్సరానికి రూ.5లక్షలు ఆదా అవుతున్నదని తెలియజేశారు. అదేవిధంగా, జిల్లాలోని అన్ని మండలాలలోని ప్రభుత్వ కార్యాలయంలో తప్పని సరిగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం వారు రాయితీని అందిస్తున్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు వారి వారి ఇళ్ళ మిద్దెల పై ఏర్పాటు చేసుకొనుటకు ముందుకు రావాలని, ఈ విషయమై ఏమైనా సందేహాలు వున్న మండల స్థాయిలో విద్యుత్ శాఖ అధికారులను లేక జిల్లా స్థాయిలో పర్యవేక్షక ఇంజనీరు, విద్యుత్ శాఖ వారి సంప్రదించాలన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటులను ప్రభుత్వ కార్యాలయాల మిద్దెలపై ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే, నెల్లూరు జిల్లాను సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో ఒకటవ స్థానంలో, ఆదర్శవంతమైన జిల్లాగా నిలపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జె.మోహన్ రావు, పరిపాలనాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రం డైరెక్టర్‌కు అభినందనలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రిరావుకు ఈనెల 24న ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్ తీసుకున్న సందర్భంగా నెల్లూరు జిల్లా దళితసంఘాల సభ్యులు ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లు సాల్మన్ రాజు మాట్లాడుతూ.. సింహాద్రి రావు సమాజంలో చేస్తున్న స్వచ్ఛందసేవ ప్రశంసనీయమని హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ఆదరణ కేంద్రం ఏర్పాటు చేసి తద్వారా ఎంతోమందికి అన్ని వసతులు ఏర్పాటు చేసి వారిని హక్కున చేర్చుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గంగపట్నం సతీష్, ముసలి నరేంద్ర, పొంగుళూరి సుధాకర్, దానం మాల్యాద్రి, ఉసురుపాటి వెంకటరమణయ్య, వేనుగోపాల్, కాకాని యస్వంత్, అంబేద్కర్ ఇండియా మిషన్, మాల పరిరక్షణ వేధిక, అంబేద్కర్ ఆర్మీ తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నంలో స్టాప్ డమేరియా, డ్రై డే



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలోని సముద్ర తీర ప్రాంతాన రొయ్యల గుంటల వద్ద వైద్య ఆరోగ్యశాఖ అధికారి బృందం స్టాఫ్ డమేరియా, డ్రై డే కార్యక్రమాన్ని జరిపింది. శుక్రవారం వైద్యశాఖ బృందం ఇక్కడ పర్యటించింది. రొయ్యలు గుంటల వద్ద జీవన భృతి కోసం ఉంటున్న గిరిజన కుటుంబాలకు ఈ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని జరిపింది. దోమలను నివారించే విధానాలు, దోమల ఉత్పత్తి విధానం, వాటి మూలంగా వచ్చేటువంటి జబ్బులు గురించి సమగ్రంగా తెలియజేశారు. స్టాప్ డమేరియా కార్యక్రమంలో ముందు చర్యలు ఆ కుటుంబాలకు అర్థమయ్యే విధంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ షుక్కూర్, హెల్త్ సూపర్వైజర్ మార్క్, హెచ్వి నిర్మలమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా సేవా కార్యక్రమాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు విశాలాక్షి, గీతామయి వృద్ధాశ్రమాల్లో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో యాచకులకు ఊటుకూరు నాగార్జున స్వయంగా ఆహార పొట్లాలు అందజేశారు.

## బెంగళూరు కేంద్రంగా వైద్యం తీసుకుంటున్నాను : డి.రామలింగయ్య



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కేంద్రంగా వైద్యం తీసుకుంటున్నామని ముత్తుకూరు మత్స్య కళాశాలకు చెందిన ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్మెంట్ (ఎఫ్ఆర్ఎం) డాక్టర్ డి.రామలింగయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇటీవల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఏ.బాలసుబ్రమణియన్‌కు తనకు మధ్య జరిగిన వివాదంలో తనను సిబ్బంది బయటకు ఈడ్చుకు వచ్చారని ఆ సంఘటనలో చెవి నొప్పి సమస్య వచ్చిందన్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఫోర్టిస్ హాస్పిటల్లో చికిత్స పొందామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నామని ఎఫ్ఆర్ఎం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తమకు ముఖ్యమన్నారు.

# ఘనంగా విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

## స్మార్ట్ ఎనర్జీ.. సేఫ్ నేషన్ నినాదంతో నిర్వాహణ : సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నగరంలోని విద్యుత్ భవన్ స్కాడా సమావేశ మందిరంలో శుక్రవారం విద్యుత్ భద్రతా వారోత్సవాల యొక్క ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీరు విజయన్ మాట్లాడుతూ.. విద్యుత్ భద్రత వారోత్సవాలు జిల్లాలో అన్ని డివిజన్‌లలో ఈనెల 26వ తేదీ నుండి జరుగుతున్నాయని, జులై 2వ తేదీ నాటితో ముగుస్తాయని తెలిపారు. వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాలుపంచుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల్లో విద్యుత్ భద్రతపై అవగాహనా పెంపొందించడం, విద్యుత్ ప్రమాదలను తగ్గించడమే ఈ వారోత్సవాల లక్ష్యం అని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రప్రభుత్వం ఆదేశానుసారం స్మార్ట్ ఎనర్జీ–సేఫ్ నేషన్ నినాదంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నమని తెలిపారు. అందులో భాగంగా అదునాతన సాంకేతికలు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం, ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్లు, రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ సంబంధించి భద్రతా ప్రమాణలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది, ఎండల నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వంటి ఎలక్ట్రికల్ గృహోపకరణాల వాడకం అధికమైందని. ఈ నేపథ్యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించి విలువైన ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టుతున్నామని తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌కు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు.

**ప్రమాదాలకు ముఖ్య కారణాలు ఇవే :** 1.లోడుకు తగినట్టు కాకుండా తక్కువ గేజ్ విద్యుత్ వైర్లను వినియోగించడం. నాణ్యతలేని తక్కువ గేజ్ వైర్లను వాడటం. 2.తగిన సామర్థ్యం లేని వైర్లతో ఏసీలు, హీటర్లు వంటివి వాడటం. 3.వైర్ల సామర్థ్యానికి మించి ఎంసీబి, ఎంసిసిబి లను బిగించటం. ఎర్త్ వైరు ఫేజ్ వైరు కన్నా చిన్నది వాడటం. 4.ఎర్త్ పిట్ లేకపోవడం. ఉన్నా నిర్వహణ సరిగా లేకపోవటం. 5. 25 ఏళ్లు దాటిన తర్వాత విద్యుత్ వైర్లు, ఎంసీబి, ఎంసిసిబిలను మార్చకపోవడం. 6.తడి చేతులతో స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదు. 7.అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వెంటనే మార్పించుకోవాలి. 8.తక్కువ ఎత్తులో తీగలు ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. 9.అనధికారికంగా ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద ఫీజులు మార్చడం, మరమ్మతులు చేయడం చేయొద్దు.

**విద్యుత్ పరికరాల నిర్వహణ ఇలా :** 1.వేసవికాలంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుంది ఎప్పటికప్పుడు ఏసీలను సర్వీసింగ్ చేయించాలి. 2.తగిన సామర్థ్యం ఉన్న వైర్లతోనే ఏసీలు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించాలి. 3.తక్కువ సామర్థ్యం గల వైర్లతో ఏసీలను వాడకూడదు. 4.ఎంసీబి, ఎంసిసిబి రేటింగ్‌ను విద్యుత్ వైర్ల సామర్థ్యానికి సమానంగా ఉన్నవి మాత్రమే వాడాలి. తగిన రేటింగ్ ఉన్నవే వాడాలి. 5.కిలో వాట్ కన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న ప్రతి ఇల్లు/షాప్/మాల్/ ఆఫీసులో తప్పనిసరిగా ఈఎల్‌సిబిలు వాడాలి. 6.20 ఏళ్ల దాటిన విద్యుత్ వైర్ల సామర్థ్యాన్ని పరీక్ష చేయాలి. 7.25 ఏళ్లు దాటిన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ పాడవుతుంది. కనుక తప్పనిసరిగా మార్చాలి. 8.ప్రతి ఇంటిలో న్యూట్రల్‌కు, ఎర్తింగ్‌కు ఎర్త్ పిట్స్ ఏర్పాటు చేయాలి. వేసవిలో తప్పనిసరిగా ఎర్త్ ఫిట్స్‌ను నీటితో నింపాలి. 9.ఇల్లు/ షాపు/ ఆఫీసు/ షాపింగ్ మాల్‌లో ఎక్కువ



సర్క్యూట్‌గా డివైడ్ చేసి, లోడుకు తగినంత వైర్ల సామర్థ్యాన్ని వాడాలి.

**ఇవికూడ ముఖ్యమే :** 1.ఇల్లు/షాపు/ఆఫీసుకు 100 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగితే 20 రేట్లు అంటే 2600 యాంప్స్ విద్యుత్ ఉత్పన్నమవుతుంది. దీని వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతాయి. 2.షార్ట్ సర్క్యూట్ అంటే న్యూట్రల్ వైరు, ఎర్తింగ్ వైరు ఫేజ్ వైర్ తో కలవడం. 3.అర్హత, లైసెన్స్ గల ఎలక్ట్రిసియన్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌తో మాత్రమే పనులు చేయించాలి. 4.ఇంటి లోపల ఐసోలేటెడ్ స్విచ్లు వాడకూడదు. 5.విద్యుత్ వైర్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ గృహపకరణాలను ధరతో సంబంధం లేకుండా నాణ్యమైనవి మాత్రమే ఉపయోగించాలి. 6.వేసవి నేపథ్యంలో పైన చెప్పిన విషయాలపై విద్యుత్ వినియోగదారులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీ శేషాద్రి బాల చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఎం.శ్రీధర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అశోక్, సునీల్, కిరణ్, రవిచంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్స్, ఆపరేషన్, మెయింటనెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోర్టు కేసులు వేగవంతంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోండి

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన కోర్టు కేసుల వాయిదాల సమయంలో క్రమం తప్పకుండా కౌంటర్లు దాఖలు చేస్తూ, పెండింగ్ లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్లలో అన్ని వివరాలను సమగ్రంగా పొందుపరిచి, దాఖలా అనంతరం తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఛార్జ్ షీట్ ఆధారంగా కోర్టు మంజూరు చేసిన సమన్లను అక్రమ నిర్మాణాల భవన యజమానులకు స్వయంగా అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలోని అనధికార లేఔట్లను నిర్మాణ స్థాయిలోనే గుర్తించి, అనుమతులు లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్లానింగ్ కార్యదర్శులు డీపీఎంఎస్ లాగిన్లలో ఉన్న తమ అప్లికేషన్లను 24 గంటల్లో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న సమస్యలకు కూడా నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలు అందించాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయ పరిధిలో నూతన భవన నిర్మాణాలు జరిగేందుకు ప్లానింగ్ కార్యదర్శులు పూర్తిస్థాయిలో సహకరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటించి నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని సూచించారు. నగర వ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుండా పర్యవేక్షించాలని, అనుమతులు లేని ప్రచార సామాగ్రిని వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. షాపులు దుకాణాలకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్



బోర్డులకు పన్నులు విధించాలని కమిషనర్ ఆదేశించారు.

### ఫ్లెక్సీలు, పోస్టర్ల ముద్రణకు అనుమతి తప్పనిసరి

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు ప్రింట్ చేసేందుకు వాల్ పోస్టర్లను ముద్రించేందుకు నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. ఫ్లెక్స్ ప్రింటింగ్, వాల్ పోస్టర్ ప్రింటింగ్ అసోసియేషన్ నాయకులతో సమావేశాన్ని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించి కమిషనర్ మాట్లాడారు. నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడానికి వాల్ పోస్టర్లను గోడలపై అంటించడానికి తప్పనిసరిగా నగరపాలక సంస్థ అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు. కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఫ్లెక్స్ ప్రింటింగ్, వాల్ పోస్టర్ ప్రింటింగ్ చేయరాదని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, రఘునాధరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదలకు సేవ చేయడమే జైఆంధ్ర ధ్యేయం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పేదలకు సేవ చేయడమే జైఆంధ్ర సమాచార హక్కు చట్టం ధ్యేయమని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఉదయగిరి మండలం కోటాయపల్లికి గ్రామానికి చెందిన మన్నే వెంకటరత్నం జైఆంధ్ర సమాచారహక్కు చట్టం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో కన్వీనర్లను ఏర్పాటు చేశామన్నారు. వారి ద్వారా పేదలకు అవసరమైన సమాచారాన్ని సమాచారహక్కు చట్టం ద్వారా సేకరించి న్యాయ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో అనేకమంది పేదలకు తమ సంస్థ ఆధ్వర్యంలో సేవలందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో రెండు రాష్ట్రాల్లో సంస్థ కార్యాకలాపాలను ఉదృతం చేస్తామన్నారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షుడితోపాటు నూతనంగా ఎంపికైన మన్నే వెంకటరత్నంను పలువురు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు, కామేపల్లి వెంకటరత్నం, పెండ్యాల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీ పై అవగాహన

**బిట్రగుంట, మేజర్‌న్యూస్ :** బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ శుక్రవారం బోగోలు ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీ పై అవగాహన కలిగిస్తూ పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క డ్రైవరు లైసెన్ యూనిఫామ్ తప్పుక కలిగి ఉండాలని అన్నారు. ఆటోలో అదిక లోడుతో ప్రయాణించవద్దని మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని తెలిపారు. ఆటోలకు సంబంధించిన అన్ని రికార్డులు కలిగి ఉండాలని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే అట్టి వారిపై చట్టపకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# పార్టీబలోపేతం ప్రధాన కర్తవ్యం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతీయజనతాపార్టీ బలోపేతం లక్ష్యంగా తమవంతుగా కృషి చేస్తున్నామని ఆత్మకూరుకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు కరటంపాటి సుధాకర్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం సుధాకర్ ఆధ్వర్యంలో సంతోష్ కుమార్ సమక్షంలో మున్సిపల్ పరిధిలోని 19వవార్డుకు చెందిన పలువురు బిజెపిలో చేరారు. పి.తిరుపతయ్య, వరలక్ష్మి, షేక్‌బాబు, బి.సుబ్బరాయుడు తదితరులు చేరారు. వారికి పార్టీకండువాలు వేసిన సుధాకర్, సంతోష్‌కుమార్‌లు పార్టీలోకి స్వాగతించారు. పార్టీ నయమావళి, కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలపట్ల ఆకర్షితులమై తాము బిజెపిలో చేరామని వారు పేర్కొన్నారు. సుధాకర్, సంతోష్‌కుమార్‌లు మాట్లాడుతూ.. బిజెపి పటిష్టానికి, బలోపేతానికి తాము శక్తివం చన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ పలువురిని ఆకర్షింపజేస్తున్నామని వారు పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమించాలని పలువురు వినతి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులకు ఏ బస్సు ఎప్పుడు వెళుతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని పలువురు తెలియజేస్తున్నారు. అదే కంట్రోలర్ గనుక ఉన్నట్లయితే వచ్చినటువంటి ప్రయాణికులకు సమగ్రమైన సమాచారం ఉంటుందని ఆందోళన పడే అవసరం లేకుండా పోతుందని అభిప్రాయపడుతున్నారు. అత్యవసర సమయాలలో ప్రయాణం చేయాలంటే సమయానికి బస్సు వస్తుందో లేదో తెలియని పరిస్థితి ఉంటుంది గతంలో కంట్రోలర్ ఉన్నందువలన ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది ప్రస్తుతం గత రెండు సంవత్సరాలుగా కంట్రోలర్ లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనుక కంట్రోలర్ ఉన్నట్లయితే అసౌకర్యం లేకుండా ఆయనే తగిన సమాచారాన్ని అందజేస్తారని ప్రయాణికులు అంటున్నారు. వింజమూరుకు నిత్యం పలు ప్రాంతాల నుండి బస్సు సర్వీసులు వస్తున్నాయి. వింజమూరు నుండి శ్రీశైలం బెంగళూరు హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు కూడా సర్వీసులు నడుస్తున్నందున ఆర్టీసీ అధికారులు పరిశీలించి పరిస్థితిని గమనించి కంట్రోలర్‌ను నియమించినట్లయితే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించినట్లు అవుతుందని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.




# విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి




- ఆర్టీఈ సెక్షన్ కింద సీట్లు పొందిన విద్యార్థులకు..
- ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలి
- పొంతనలేని సమాధానాలతో నిర్లక్ష్యం చేయడం అన్యాయం
- సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** భావిభారత పౌరులైన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి బాటలు వేసే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న విద్యా హక్కుచట్టాన్ని కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంతో నీరుగారుస్తున్న నేపథ్యంలో పటిష్ట కార్యాచరణతో అమలు చేసే భాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య యాదవ్ విన్నవించారు. శుక్రవారం పలువురు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నగరంలోని అంబర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ను సంప్రదించిన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఆర్టీఈ సెక్షన్ కింద సీట్లు పొందిన బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలంటూ గత పదేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నోజీవోలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇదేక్రమంలో ఈ ఏడాది కూడా విద్యాహక్కుచట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లలో విద్యా హక్కుచట్టాన్ని అమలు చేస్తున్నప్పటికీ.. మరికొన్ని పాఠశాలల్లోను విస్మరిస్తుండటం, ప్రత్యేకించి అంబర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతుండటం పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే నన్నారు. విద్యాహక్కు చట్టం ద్వారా 5 రోజుల క్రితం సీట్లు పొందిన పేదవిద్యార్థులకు సాక్ష్యాత్తు డిప్యూటీ డీఈవో సమక్షంలో సీట్లు ఇచ్చి ప్రవేశం కల్పిస్తామని హామీ ఇచ్చిన అంబర్ ఉడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈరోజు ప్రభుత్వం నుంచి తమ స్కూల్కు ఫీజు రావడంలేదని, అందువల్ల సీట్లు ఇవ్వలేమని మాటమార్చి ఆశగా వచ్చిన తల్లిదండ్రులను నిరాశతో తిప్పిపంపడం దారుణమన్నారు. విద్యాహక్కు చట్టం కింద సీట్లు పొందిన విద్యార్థులకు.. ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు నిరాకరించడాన్ని బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి లోపం ఎక్కడుందో సమగ్ర విచారణ ద్వారా గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గాయత్రి (పడారుపల్లి), దేవళ్ల పెంచలయ్య, సునీల్. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు వెంగబాబు, వెంకటేశ్వర్లు, గంగాధర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి మహిళా సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించాలి







**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామీణాభివృద్ధిలో మహిళా సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించాలని, తగిన చైతన్యంతో అన్నిఅంశాలను అవగాహన చేసుకొని అభివృద్ధి, సంక్షేమం సాధించాలని ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజనల్‌స్థాయి మహిళా సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా శనివారం రెండవరోజు కొనసాగగా ఆదివారం ముగియనుంది. ఈసందర్భంగా ఎంపిపి శిక్షణను ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం పాలనావకాశం కల్పించిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం, పారిశుధ్యం, వీదిదీపాలు, త్రాగునీరు తదితరాలతోపాటు ప్రజావసరాలు, ఆకాంక్షలు, మౌళికవసతులు తదితరాలు మహిళలకు బాగా అవగాహన ఉంటుందని, ప్రభుత్వం ఈఅంశాలకు సంబంధించి చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు, ఇస్తున్న నిధులు, పంచాయతీల సాధారణ నిధులు తదితరాలన్నింటిపట్ల మరింతగా అవగాహన పెంపొందించుకోవాలని, చైతన్యవంతులు కావాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయాలని, గ్రామాలను తమహయాంలో మరింతగా అభివృద్ధి చేశామన్న సంతృప్తిని పొందాలని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. అన్నిఅంశాలను తెలియజేసేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా నిపుణులను రప్పించి శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. 3రోజులపాటు వారు తెలియజేసే అన్ని అంశాలను శ్రద్ధగా స్వీకరించి ఆమేరకు విధులు నిర్వహించాలని ఎంపిపి కోరారు. మహిళా సర్పంచ్‌ల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, వారి విధులు, బాధ్యతలు గుర్తు చేసి నాయకత్వపటిమను పెంపొందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్య క్రమం ఏర్పాటు చేసిందన్నారు. అధికారుల సమన్వయంతో మౌళిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వ హించాలని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఎంపోటీలు శివ, మహ్మద్, జిలానీబేగ్, పి.శ్రీవిద్య మహిళలకు పలు అంశాలగురించి శిక్షణ ఇచ్చారు. పరిశీలకులు ఏ.ప్రసాద్, మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# నువ్వురుపాడులో పర్యటించిన ఎంపీడీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆత్మకూరు ఎంపిడివో రఫీఖాన్ మండలంలోని నువ్వురుపాడును పరిశీలించారు. గ్రామంలో చెత్తసేకరణను ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ చెత్తను సేకరించి తరలించాలని, ఏమాత్రం అశ్రద్ధచేయరాదని ఆయన సూచించారు. అనంతరంగా గ్రామంలో సంపదతయారీ కేంద్రభవనాల పనులు పరిశీలించారు. అక్కడ భవన నిర్మాణం కేవలం పిల్లర్లకే పరిమితమై ఉండడం చూశారు. 2018-19లో ఈ భవన నిర్మాణానికి 5.7లక్షలరూపాయలు మంజూరయ్యాయని, ఇంకా పిల్లర్లకే పరిమితమై ఉండడం విచారకరమన్నారు. ఈనిర్మాణపనులు పూర్తిచేసేందుకు అన్నీ చర్యలు తీసుకుంటామని ఎంపిడివో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ తెలుగుదేశం నాయకుడు మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

● నెల్లూరు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీధర్

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఏపీదక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఆధీనంలో ఉన్న 33/11 కెవి తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్వెడల్పు పనులు జరుగుతున్నందున గాంధీనగర్, డైకస్, సుభాష్ చంద్రబోస్‌నగర్, శాంతినగర్ పరి సర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలి కంగా నిలిపివేయడం జరుగుతుందని నెల్లూరు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదేక్రమంలో 33/11 కెవి ఏకే నగర్ బస్టేషన్ పరిధిలోని 11 కెవి చంద్రమౌళినగర్ ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మత్తులు జరుగుతున్నందున చంద్రవ గౌళినగర్, గాయత్రినగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్. సావిత్రినగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని, ఈ మార్పులను సహృదయులైన విద్యుత్ వినియోగదారులు గమనించాలని, అత్యవసర విభాగం వారు ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

## మహిళల స్వయం ఉపాధి లక్ష్యం : సాధికారిత ఆశయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిళల స్వయం ఉపాధి లక్ష్యంగా వారు సాధికారిత సాధించాలన్నదే ఆశయమని ఆత్మకూరు మెప్మా సిఎంఎం హర్షిత, సివో జి.మాధవిలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్వయం సహాయకసంఘాల మహిళలు రూపొందించిన అనేకరకాల వస్తువులను విక్రయించేలా స్థానిక మున్సిపల్ బస్టాండు వద్ద మార్కెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు తయారుచేసిన అన్నిరకాల వస్తువులను ప్రదర్శనగా ఏర్పాటు చేసి విక్రయాలు సాగించారు. ఈసందర్భంగా సిఎంఎం హర్షిత, సివో మాధవిలు ప్రసంగించారు. తమ స్వయంసహాయకసంఘాల మహిళలు తయారుచేసే ఉత్పత్తులు నాణ్యంగా, మన్నికగా, ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. దాంతో పలువురు ప్రజలు మార్కెట్‌ను సందర్శించి కొనుగోలు చేశారన్నారు. మహిళలను ఆదుకునేందుకు, వారు తయారుచేసిన వస్తువులను విక్రయించేలా ప్రోత్సహించేందుకు తాము శ్రద్ధగా కృషిచేస్తున్నామని వారు పేర్కొన్నారు. జనసంచారంలో మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరూ గమనించి అధికంగా విక్రయాలు జరిగే అవకాశాలుంటాయని ఇక్కడ మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కూడా ఏర్పాటుకు యోచిస్తున్నామని పేర్కొన్నారు. మహిళల ఉపాధిలక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ మార్కెట్‌లో వారు తయారుచేసిన వస్తువులను ప్రజలు విరివిగా కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని హర్షిత, మాధవిలు కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్‌పిలు, స్వయం సహాయకసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

